తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
28 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

# రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం బిజెపి ఆధ్వర్యంలో భిక్షాటన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 జనంసాక్షి:** మాదవనగర్ ఆర్వోబి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదల జాప్యం చేయడంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బిక్షాటన నిర్వహించారు. మంగళవారం మాదవనగర్ ఆర్ వోబి వద్ద ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్రవంతిరెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్ లు మాట్లాడుతూ ఈ మాధవ్ నగర్ గేటుతో నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా అన్ని రకాల వాహనాలు సుమారు 4 నుంచి 5 వేల వరకు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. అలాగే ప్రతిరోజు 24 గంటల్లో 58 రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో ప్రతిసారి 15 నుంచి 20 నిమిషాల వరకు గేటు పడటం,భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రధానంగా ఈ సమస్యతో స్కూల్ పిల్లలు స్కూల్ కి లేట్... కూలీలు పనికి లేట్..రోగులు హాస్పిటల్ కి లేట్ ... ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగానికి లేట్... చివరికి శవాలు కూడా స్మశానానికి లేట్ గా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆర్ వోబీ కొరకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి కేంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. రైల్వే శాఖ తనవంతు పని పూర్తి చేసిందని,మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాధవ్ నగర్ ఆర్ ఓబిపై ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డిని గత ఏడాది కలిస్తే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం ఇచ్చినట్లు గుర్తు కానీ ఇప్పటివరకు ఎందుకు పూరి కావడం లేదని ప్రశ్నించారు. నిధులు విడుదల చేసేంత వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు.

# పిల్లలు పుట్టడం లేదనే కారణంతో భార్య హత్య: భర్త అరెస్ట్

## పరారీలో ఉన్న నిందితుడిని తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు




**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 27 ( జనంసాక్షి ) :** పిల్లలు కలగడం లేదనే కారణంతో భార్యను గొంతు పిసికి హత్య చేసిన కేసులో నిందితుడైన భర్తను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 25న రాత్రి దావు చంద్రకుమార్ అనే వ్యక్తి తన భార్య స్వరూపను గొంతు పిసికి హత్య చేశాడు.ఈ దారుణ ఘటన అనంతరం నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో నిందితుడు తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద సంచరిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన కరీంనగర్ రూరల్ సీఐ/ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని, పారిపోయేందుకు యత్నిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**విచారణలో వెల్లడైన వివరాలు:**

నిందితుడు దావు చంద్రకుమార్ ప్రస్తుతం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ లేబర్గా పనిచేస్తున్నాడు. తనకు పిల్లలు కలగడం లేదనే నెపంతో భార్య స్వరూపకు విడాకులు ఇవ్వాలని ప్రయత్నించాడు. అయితే ఇందుకు ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో, ఎలాగైనా భార్యను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు.ఈ నెల 25వ తేదీ రాత్రి మద్యం సేవించిన నిందితుడు, తన భార్యను తీసుకెళ్లాలని ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. అదే రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో నిద్రిస్తున్న భార్య స్వరూప గొంతు పిసికి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు.అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా అక్కడ నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు చిక్కకుండా రైలు ఎక్కి వేరే ప్రాంతానికి పారిపోవడానికి తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్కు వచ్చినట్లు నిందితుడు తెలిపాడు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న అనంతరం పంచుల సమక్షంలో నేర అంగీకార పంచనామా నిర్వహించి, పోలీస్ స్టేషన్కు తరలించారు. రిమాండ్ ప్రక్రియలో భాగంగా నిందితుడిని ఈరోజు న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు.



# అభివృద్ధి పనులకు శ్రీకారం

## రూ.42.80 కోట్లతో 71.63 కి.మీ. రహదారుల అభివృద్ధికి శంకుస్థాపన

## గిద్ద, కుప్రియాల్లో విద్యుత్ ఉపకేంద్రాలు.. మహిళా సమాఖ్య భవనం ప్రారంభం

**సదాశివనగర్, అక్టోబర్ 27 (జనంసాక్షి):** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్, మహిళా సాధికారతకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ మంగళవారం శ్రీకారం చుట్టారు. రామారెడ్డి మండలం మోషంపూర్ చౌరస్తా వద్ద హైబ్రిడ్ యాన్యుటీ విధానం (హెచ్ఏఎం) మొదటి దశలో రూ. 42.80 కోట్ల వ్యయంతో 71.63 కిలోమీటర్ల మేర చేపట్టనున్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పోసానిపేట గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి, ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**విద్యుత్ ఉపకేంద్రాల స్థలాల పరిశీలన**

రామారెడ్డి మండలం గిద్ద, సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామాల్లో నూతన విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ పరిశీలించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏడు విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే చేసిన కృషి అభినందనీయమని మంత్రి సీతక్క అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహకారం అందిస్తున్నారని, జిల్లా ఇన్చార్జి మంత్రిగా తాను కూడా అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు.

**గిద్దకు రూ.2.88 కోట్లు.. కుప్రియాల్కు రూ.2.63 కోట్లు**

గిద్ద గ్రామంలో రూ. 2.88 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. అలాగే సదాశివనగర్ మండలం కుప్రియాల్లో రూ. 2.63 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ ఉపకేంద్రాలు అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాలతోపాటు **వార్తా లోపలి పేజీలో**

# విద్యార్థులకు నాణ్యమైన విద్య

## జూనియర్ కళాశాలలో 95.6 శాతం ఉత్తీర్ణత



**బాల్కొండ న్యూస్ 27 అక్టోబర్ ( జనంసాక్షి)** నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రోత్సాహం అందిస్తున్నాయి. విద్యార్థుల అభ్యున్నతికి కళాశాల అధ్యాపక బృందం కృషి చేస్తోందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.డి. రజ్వీద్దీన్ అస్లాం తెలిపారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం మొత్తం 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 150 మంది విద్యార్థులు, 200 మంది విద్యార్థినులు ఉన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సు కూడా అందుబాటులో ఉంది. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కళాశాలలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సేవలందిస్తున్నారు. 2025?26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 95.6 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ ఫలితాలు కళాశాల అధ్యాపకుల కృషికి, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. క్రీడా రంగంలోనూ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. వాలీబాల్ పోటీల్లో విజ్ఞాన్ రాజ్తో పాటు ఈమతేజా అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బహుమతులు సాధించి కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. బాల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా సుమారు 150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కళాశాలలో జాతీయ పండుగల వేడుకలు, కళాశాల వార్షికోత్సవాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించేలా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తూ, ఉన్నత ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.



## ఎల్ నీనో ను సమర్ధవంతంగా ఎదుర్కొద్దాం

### జైతాపూర్ సర్పంచ్ నాగుల రాజు గౌడ్

**ఎడపల్లి, అక్టోబర్ 27 ( జనంసాక్షి ) :**
ఎల్ నీనో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడడంతో పాటు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున గ్రామస్తులు సమిష్టిగా నీటి ఎద్దడిని నివారించేందుకు కృషి చేయాలని ఎడపల్లి మండలం జైతాపూర్ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగుల రాజు గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధాని కూలీలకు ఎల్ నినో ప్రభావం పై అవగాహన కల్పించారు. గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగా ఇంకుడు గుంతలు, వ్యవసాయ గుంతలు, మురికి నీరు ప్రవహించే చివరి దశ వద్ద ప్రత్యేక గుంతలు వంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు సైతం ప్రతి నీటి బొట్టును ఎంతో జాగ్రత్తగా వాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వర్షపు నీటిని సైతం వృధాగా పోనే?యకుండా ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని ఇందుకు గ్రామస్తులు పూర్తి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్ల ఆధ్వర్యంలో జైతాపూర్ గ్రామాన్ని అభివృద్ధి బాటలో పయనించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందులో భాగంగా ఎల్ నినోపై ప్రజలు అప్రపత్తంగా ఉండేందుకు అవగాహన ఇవ్వడం జరిగిందని జైతాపూర్ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగుల రాజు గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ పథకం కూలీలు ఉన్నారు.

## 2024 డి ఎస్ సి లో ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లర్ చేసి ఇంక్రిమెంట్ మంజూరి చేయాలి

### టి ఎస్ యూటీఫ్ జిల్లా విద్యాధికారి కి వినతి పత్రం



**కోరుట్ల అక్టోబర్ 27 (జనంసాక్షి)**
జగిత్యాల జిల్లాలోని మంగళవారం రోజు టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ లు జగిత్యాల జిల్లా విద్యాధికారి కెలవత్ రాము కు 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియామకం అయిన వారికి ప్రొఫెషన్ డిక్లేర్ చేస్తూ రెండవ ఇంక్రిమెంట్ను వెంటనే మంజూరు చేయాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది.మరియు జిల్లాలోని ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది.



## జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన మేడపాటి

**బోధన్, అక్టోబర్ 27 ( జనంసాక్షి ) :**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వీర జవాన్ నవాతే రక్షిత్ కుటుంబంను మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. బోధన్ మండలం ఆమ్దాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ కుమారుడైన జవాన్ అకాల మరణం పట్ల తన ప్రగాఢ సంతాపంను తెలిపి పరామర్శించారు. వారికి ఆ భగవంతుడు ఇట్టి బాధను తట్టుకొనే శక్తిని ఇవ్వాలని ధైర్యంగా ఉండాలని కోరారు. మేడపాటితో పాటు బీజేపీ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపికిషన్, బీజేపీ సీనియర్ నాయకులు సంగ్రామ్ పటేల్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు గౌతమ్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నీరడి బాబురావు, బీజేపీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్ గౌడ్, అరె శ్రీపతి, సిర్ప ప్రశాంత్, జంగం సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం




**మల్యాల అక్టోబర్ 27 (జనంసాక్షి)**
విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ మంగళవారం మల్యాల పోలీస్ స్టేషన్లో నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు,పోలీసు సిబ్బంది విధులు మరియు బాధ్యతలు,నేర పరిశోధనలో అనుసరించే విధానాల గురించి వివరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో మరియు ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులకు మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని ఎస్సై సందీప్ తెలిపారు.





## కోరుట్లలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల కొరడా

**కోరుట్ల, అక్టోబర్ 27(జనంసాక్షి )**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భవనాన్ని కూల్చివేయడంతో భవన యజమాని జాప లచ్చన్న అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలోనే నోటీసులు జారీ చేసినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టడంతో, సెట్బ్యాక్ లేకుండా నిర్మించిన దుకాణాలను అధికారులు తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## ఎస్ జి ఎఫ్ జగిత్యాల జిల్లా పోటీలలో భూషణరావుపేట విద్యార్థి ప్రతిభ



**కథలాపూర్ అక్టోబర్ 27 (జనంసాక్షి)**
కథాలాపూర్ మండలంలోని భూషణరావుపేట గ్రామంలోనీ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న దేశవేని శ్రీనాథ్ అనే విద్యార్థి ట్రిపుల్ జంప్ పోటీలో జగిత్యాల జిల్లా ఎస్జీఎఫ్ క్రీడలలో భూషణరావుపేట పాఠశాలకు మొదటి స్థానం సాధించడం జరిగింది. మరియు జావలిన్ త్రో విభాగంలో ద్వితీయ స్థానం సాధించి ఉమ్మడి జిల్లా స్థాయి కరీంనగర్ లో జరిగే పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి ఉపసర్పంచ్ గంగ పోశయ్య , వార్డ్ మెంబెర్స్ ప్రశాంత్ మైదీను బేగం మరియు గ్రామంలోని యువకులు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి సన్మానించడం జరిగింది.

## రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

**రుద్రంగి, నవంబర్ 27 (జనంసాక్షి)**
భూముల రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి, ప్రతి సర్వే నంబర్ వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు.రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే సర్వే చేపట్టాలని,రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాసిల్దార్ పుష్పలత ఆర్ఐ శ్యామ్ రెవెన్యూ సిబ్బంది సర్వేయర్ తదితరులు ఉన్నారు.



## భూ హక్కుల పరిరక్షణకు రీ సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం కీలకం

### అమ్మనగుర్తి గ్రామ సర్పంచ్ కదిరె రమేష్



**సైదాపూర్ అక్టోబర్ 27( జనం సాక్షి)**
సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ కదిరె రమేష్ అధ్యక్షతన భూభారతి రీ సర్వేపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భూమి ప్రతి రైతుకు ఎంతో విలువైన ఆస్తి అని, భూమికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండటం భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.భూభారతి రీ సర్వే ప్రక్రియపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, తమ భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలను పాటిస్తూ రీ సర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. భూములకు సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యం చేయకుండా, తమ హక్కులకు సంబంధించిన రికార్డులపై స్పష్టత పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కరీంనగర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. కిషన్ రావు, డీఐ గాజుల రత్నం, పి. లక్ష్మణ్ నాయబ్ తహశీల్దార్, మండల గిర్దావర్ ఎం. రవి, సర్వేయర్ మనోజ్, గ్రామ ఉపసర్పంచ్ లంక దాసరి కార్తీక్, జీపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## ఏఎంసిచైర్మన్‌గా మహ్మద్ హమీద్..

## వైస్ చైర్మన్‌గా మేడ భాస్కర్ను సన్మానించిన ప్యాక్స్ చైర్మన్ వెంకటి, పర్శ హనుమాన్లు..

**గంభీరావుపేట, అక్టోబర్ 27, జనంసాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం సోమవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా మహ్మద్ హమీద్, వైస్ చైర్మన్‌గా మేడ భాస్కర్‌ను నియమించింది. డైరెక్టర్లుగా గ్యార శ్రీజ, బిచ్చాల సతీష్, భూక్య మురళి, ఎర్ర వేణుగోపాల్, పెద్దవేని రాజమల్లయ్య, పుల్లూరి సంతోష్, రఘువీర్ ప్రసాద్, గాడిచెర్ల శ్రీనివాస్, అల్లెపు రాము, లక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాగపురి రమేష్ గౌడ్‌లను నియమించింది.

**బతుకమ్మ ఘాట్ నుంచి అమరవీరుల స్థూపం వరకు బైక్ ర్యాలీ**

నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకాన్ని పురస్కరించుకుని గంభీరావుపేట మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ నుంచి అమరవీరుల స్థూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు హర్శ హన్మాండ్లు మాట్లాడుతూ నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కేకే మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు**

మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ వేశాల వెంకటితో పాటు ప్రసాద్ రావు, గూడెల్లి ప్రవీణ్, జి. శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు





## జర్నలిస్ట్ సమ్మయ్యను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని,అక్టోబర్ 27, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని దొంతులవాడ లో మంథని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రజ్యోతి ఆర్ సీ ఇంచార్జ్ పోతరాజు సమ్మయ్య తల్లి పోతరాజు వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల విచారణ వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులైన పోతరాజు శ్రీనివాస్, వెంకటేష్, వెంకటలక్ష్మి, తిరుమల, స్వప్నలను ఓదార్చి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మంథని మున్సిపల్ చైర్మన్ పొద్దాల శ్రీనివాస్, ఈఆర్ సీ శశిభూషణ్ కాచే, ఏఎంసీ కుడుదుల వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, ఆర్టీఏ మెంబర్ మంథని సురేష్, గౌతమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుండా రాజు, నేతలు ఉప్పట్ల శ్రీనివాస్, కొండ శంకర్, జంబోజు సమ్మయ్య, అంకూష్ మాచీడి రవితేజ గౌడ్, రాము గౌడ్ ఉన్నారు.

## దులూరు గ్రామంలో ఇంకుడు గుంతల పై అవగాహన కార్యక్రమం

**కథలాపూర్ అక్టోబర్ 27 (జనం సాక్షి)**



కథలాపూర్ మండలంలోని దులూరు గ్రామంలో సర్పంచ్ ఎండి.రజియా బేగం అజీమ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ఇంకుడు గుంతల నిర్మాణం పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్ వార్డు సభ్యులు గణేష్ కిరణ్ పంచాయతీ కార్యదర్శి ఎండి నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో జప్తు చేసిన వాహనాల బహిరంగ వేలం

### - ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్. రజిత

పెద్దపల్లి,అక్టోబర్ 27(జనంసాక్షి) : పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జప్తు చేయబడిన (7) వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్. రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలు 46(2) టి ఎస్.ఎక్సైజ్ చట్టం, 1968 / 13(2) సెక్షన్ టి ఎస్ ప్రొహిబిషన్ యాక్ట్, 1995 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జప్తు చేయబడ్డాయని ఆమె పేర్కొన్నారు. అబ్కారీ డిప్యూటీ కమిషనర్, కరీంనగర్ డివిజన్ ఉత్తర్వుల సంఖ్య సిఆర్ నంబర్.198/2026/ఓ అండ్ ఇ ఎక్స్/ఎ 6, తేది: 22.09.2026 అండ్ 16.10.2026 ఆదేశాల అనుసారం అక్టోబర్ 29వ తేదీన ఉదయం 11:00 గంటలకు బందారికుంటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, పెద్దపల్లి వద్ద బహిరంగ వేలం నిర్వహించబడుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 29, 2026వ తేదీన ఉదయం 9:00 గంటల నుండి 10:00 గంటల వరకు ధరావత్తు సొమ్మును డిపాజిట్ చేసి, రసీదు తీసుకోవాలని, బహిరంగ వేలం ప్రక్రియ ఉదయం 11:00 గంటలకు నిర్వహించబడుతుందని, మరిన్ని వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో పెద్దపల్లిలోని మద్య నిషేధ (అబ్కారీ) ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఇన్స్పెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బండి సంజయ్ పరామర్శ

**సుల్తానాబాద్,అక్టోబర్ 27(జనంసాక్షి) :** సుల్తానాబాద్ పట్టణానికి చెందిన భూసారపు రాజలింగు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భూసారపు రాజలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భూసారపు రాజలింగు మరణం ఆవేదన కలిగించిందని, మంచి మనసున్న వ్యక్తిగా రాజలింగం ఆదర్శ భావాలు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారని బండి సంజయ్ కొనియాడారు. ఆయన వెంట బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, కౌన్సిలర్ కందునూరి సమత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కాయకల్ప ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ



పెద్దపల్లి,అక్టోబర్ 27(జనంసాక్షి) : భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో మంగళవారం కాయకల్ప ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం,వ్యక్తిగత పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్ (ఐ సి ఎన్), క్వాలిటీ మేనేజర్, ఆర్ఎంఓ తదితరుల సమక్షంలో వివిధ పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం (హ్యాండ్ హైజీన్) యొక్క ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, ఆసుపత్రిలో ఉపయోగించే వైద్య పరికరాల శుభ్రత,క్రిమిసంహారక ప్రక్రియలు,పరికరాల స్టెరిలైజేషన్, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆసుపత్రి అంతస్తుల శుభ్రత, టాయిలెట్ల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోగులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఈ కార్యక్రమం ద్వారా సూచించారు.

## అనాథ శవంకు అన్నీ తనై అంత్యక్రియలు

### గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్

**కథలాపూర్ అక్టోబర్ 27 (జనంసాక్షి)**



కథలాపూర్ మండల కేంద్రంలోని అనాథ సేవంగా ఉన్న తొగరి గంగారం మంగళవారం రోజున కథలాపూర్ బస్టాండ్ ఆవరణలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్, ఉపసర్పంచ్ ప్రసాద్, మరియు పాలకవర్గం కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. గంగారాం గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామపంచాయతీ పనులు చేస్తున్నారని వారు తెలియజేశారు.

## కాలువలో వృద్ధురాలి మృతదేహం గుర్తింపు

ఇల్లంతకుంట అక్టోబర్ 27 (జనంసాక్షి)



ఇల్లంతకుంట మండలం ఓబులాపురం గ్రామ శివారులోని కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని అదే గ్రామానికి చెందిన సంపతి రాజవ్వ (70), బంధువులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజవ్వ గత నెల రోజుల క్రితం కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఈ క్రమంలో మంగళవారం ఓబులాపురం గ్రామ శివారులోని కాలువలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న రాజవ్వ కుటుంబ సభ్యులు మృతదేహంపై ఉన్న దుస్తులు, ఆభరణాలను బట్టి ఆమెను గుర్తించారు. సమాచారం అందుకున్న ఇల్లంతకుంట ఎస్ఐ ఉపేంద్ర చారి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సిరిసిల్లకు చెందిన ఫోరెన్సిక్ వైద్యులను ఘటనా స్థలానికి రప్పించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పెద్దపల్లి పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**పెద్దపల్లి,అక్టోబర్ 27(జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల వారోత్సవాలు లో భాగంగా సోమవారం పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ ఐ రాజశేఖర్ మరియు సిబ్బంది, విద్యార్థులకు పోలీస్ స్టేషన్ లో జరుగు కార్యక్రమాల గురించి మరియు సమాజంలో పోలీసుల పట్ల గౌరవం పెరిగేలా పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల తీసుకునే చర్యల గురించి వివరించారు.



# క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

## ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

**ఇల్లంతకుంట అక్టోబర్ 27(జనంసాక్షి )**

ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ఎస్సీ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జై శ్రీమన్నారాయణ ట్రస్ట్ భవనంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు వ్యాధి బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగిన తన సతీమణి, గైనకాలజిస్ట్ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ చొరవతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎం.ఎన్.జే. ఆంకాలజీ సంస్థ, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రానికి చెందిన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిసు_న్నారని, క్యాన్సర్ బాధితులను గుర్తించిన



అనంతరం ప్రభుత్వపరంగా వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంలో కార్పొరేట్ ఆసుపత్రుల ప్రమేయం ఉండదని, ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అంకిత్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మాట్లాడుతూ.. మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సంబంధించి మూడు రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలోవైద్య సిబ్బందితోపాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కరరెడ్డి, పాక్స్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, సర్పంచుల మండల ఫోరమ్ అధ్యక్షుడు మామిడి రాజు, సర్పంచ్ లు నవీన్ రెడ్డి,నేరెళ్ల విజయ్,కళ్యాణ్, కాత మల్లేశం, వొళ్ళాల వెంకటేశం, అంతగిరి వినయ్,పసుపు వెంకటి,జమాల్, నవీన్,పుష్పలత,రేగుల కార్తీక, అంతటి శ్రీకాంత్, వంశీ, సుమన్,నాయకులు పాల్గొన్నారు.

# 28 ఏళ్ల సేవకు గుర్తింపుగా పదోన్నతి

## హెడ్ కానిస్టేబుల్ గా కుమారస్వామి

**శంకరపట్నం అక్టోబర్ 27 జనంసాక్షి:**

శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం కుమారస్వామి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఆయన గత 28 ఏళ్లుగా పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా సేవలందిస్తున్నారు. సోమవారం సీపీ గౌస్ ఆలం చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్ బ్యాడ్జీలను అందుకున్నారు. సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖకు సేవలందించిన కుమారస్వామికి పదోన్నతి లభించడంతో కేశవపట్నం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన

**శంకరపట్నం అక్టోబర్ 27 జనంసాక్షి**



విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధులు సూచించారు. శంకరపట్నం మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్‌లో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మత్తు పదార్థాల నివారణ, విద్యార్థుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల అభియాన్ ఇన్‌చార్జి డాక్టర్ మహేందర్ కట్కూరి సహకారం అందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాలపై వాటి ప్రభావం, విద్యార్థుల భవిష్యత్తుకు కలిగే నష్టాలను వివరించారు. చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసలైతే విద్యాభ్యాసం దెబ్బతినడంతో పాటు ఆరోగ్యం, వ్యక్తిగత జీవితం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి, లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని తెలిపారు. అనుమానాస్పద సందేశాలు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.విద్యార్థుల్లో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన పెంపొందించడంతోపాటు బాలికల సాధికారత, కౌమారదశలో భద్రత, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు సుందరగిరి సాయికిరణ్ గౌడ్, ప్రియాంక, గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అండ్ అడలసెంట్ సేఫ్టీ క్లబ్ ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు బొల్లం రాజు, సతీష్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన ముఖ్య అతిథులను ఈ సందర్భంగా సన్మానించారు.

# ఎన్నారై పూర్వ విద్యార్థుల సహకారం తో పాఠశాల స్టేజి నిర్మాణం భూమి పూజ

కథలాపూర్ అక్టోబర్ 27 (జనం సాక్షి)

కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలోని మంగళవారం రోజున స్టేజి నిర్మాణం కొరకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులైన ఎన్ఆర్ఐలు ముస్కు రాము, ముస్కు శ్రీనివాస్, తరి గంగ నరసయ్య,గోపిడి రాజేందర్,25 వేల చొప్పున లక్ష రూపాయలు విరాళం అందించడం జరిగింది. పాఠశాలలో మంగళవారం రోజు భూమి పూజ నిర్వహించడం జరిగింది. స్టేజి నిర్మాణం సహకరించిన పూర్వ విద్యార్థులను పాఠశాల యజమాన్యం ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగ పోచయ్య, వార్డు మెంబర్లు ప్రశాంత్ మైదిన్ బేగం,ఫ్యాక్స్ సింగల్ విండో చైర్మన్ గడ్డం స్వామి రెడ్డి,ప్రధానోపాధ్యాయుడు రాజయ్య,గ్రామంలోని పూర్వ విద్యార్థులు ఈ భూమి పూజలో పాల్గొనడం జరిగింది.



# సహకార సంఘమును సందర్శించిన ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ విద్యార్థుల బృందం

**చొప్పదండి, అక్టోబర్ 27 (జనం సాక్షి ):**

చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ని సంబంధించిన ఐదుగురు విద్యార్థుల బృందం సందర్శించారు. గ్రామీణ ప్రాంతాలలో సహకార వ్యవస్థ ఎలా పనిచేస్తుంది అన్న దాని గురించి నేర్చుకోవడానికి ఈ బృందం చొప్పదండి సహకార సంఘానికి వచ్చినట్లు సంఘం కార్యదర్శి తిరుపతి రెడ్డి తెలిపారు సంఘ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సహకార సంఘం రైతులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను సవివరంగా వివరించారు. సంఘ సభ్యులకు కేవలం అప్పులు ఇవ్వడం వసూలు చేయడమే కాకుండా రైతులకు అవసరమైన ఎరువులు పురుగుమందులు బియ్యం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. చొప్పదండి మరియు చుట్టుపక్కల మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ పథకమైన జన ఔషాదీ కేంద్రాన్ని ప్రారంభించి అతి తక్కువ ధరలకే మండల ప్రజలకు వారి అవసరాలకు మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 2013 సంవత్సరంలో పెట్రోల్ పంపు కూడా సంఘం ద్వారా ఏర్పాటు చేశారని తెలిపారు. చొప్పదండి పట్టణ శివారులో సంఘానికి ఉన్న 5 ఎకరాల స్థలంలో కేంద్ర ప్రభుత్వ పథకం అయినటువంటి పీఎం కుసుమ్ ద్వారా 1 మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయని మరో



15 రోజుల్లో దీని ద్వారా ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు, దీని ద్వారా సంఘానికి అదనంగా 5 లక్షల వరకు ఆదాయం ప్రతినెల వస్తుందని తెలిపారు. రానున్న ఎల్ నినో ప్రభావంతో ప్రభుత్వం వరి పంట విస్తీర్ణం తగ్గించాలని సూచించడంతో... పప్పు దినుసులు పండించే రైతులను గుర్తించి సంఘం తరపున తగు ప్రోత్సాహకాలు అందించడానికి కూడా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించి త్వరలో విధివిధానాల రూపొందించి రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. రైతులు పండించిన పప్పు దినుసులను సంఘమే కొనుగోలు చేసి వారికి మార్కెట్ ధర కంటే ఎక్కువ డబ్బులు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తున్నామని అలాగే సంఘం సేకరించిన పప్పు దినుసులను దాల్ మిల్ ఏర్పాటు చేసి పప్పులుగా మార్చి సంఘం బ్రాండ్ తో ప్రజలకు అమ్మడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి,నాయకులు మునిగాల సుధాకర్, సంఘ సిబ్బంది, తిరుపతి శ్రీ పాల్ కావ్య శ్రీకాంత్ రాజమౌళి మమత తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మహాసభకు తరలివెళ్లిన చిగురుమామిడి రేషన్ డీలర్లు

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 5వేల గౌరవ వేతనం,రూ.300క్వింటాల్ కమిషన్ వాగ్దానాల అమలుకై పోరుబాట..**



**చిగురుమామిడి అక్టోబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక రాష్ట్రస్థాయి సమావేశానికి చిగురుమామిడి మండలానికి చెందిన రేషన్ డీలర్లు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. చరిత్రలోనే మొట్టమొదటిసారిగా బ్యాలెట్ పేపర్ ద్వారా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన నాయకోటి రాజు,నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఈ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. గజ్వేల్,ప్రజ్ఞాపూర్ లోని బింగి ఎల్లయ్య ఫంక్షన్ హాల్లో రాష్ట్రస్థాయి సమావేశంలో రేషన్ డీలర్ల చిరకాల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ముఖ్యంగా గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ప్రతి రేషన్ డీలరుకు నెలకు రూ. 5వేల గౌరవ వేతనం,క్వింటాలుకు రూ.300చొప్పున కమిషన్ అందించే వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని ఈ సభ ద్వారా డిమాండ్ చేశారు.ప్రభుత్వ వాగ్దానాల సాధనతోపాటు రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించడం వంటి ప్రధాన అంశాలపై భవిష్యత్ కార్యాచరణను ఈ వేదికపై రూపకల్పన చేయనున్నారు. కావున, చిగురుమామిడి మండల పరిధిలోని రేషన్ డీలర్లందరూ తమ హక్కుల సాధన కోసం,సమస్యల పరిష్కారం కోసం ఈ రాష్ట్రస్థాయి సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేసినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.తరలి వెళ్లిన వారిలో అధ్యక్షులు తాళ్లపల్లి భాస్కర్ గౌడ్,కార్యదర్శి తాళ్లపల్లి సుజాత తిరుపతి,ఉపాధ్యక్షులు బోయిని చంద్రయ్య,కోశాధికారి మట్టెల కొమురయ్య,అందె పరుశురాములు, ధోనపాటి రాజిరెడ్డి,బింగి సంపత్,మండల కొమురయ్య,మునిపురి అశోక్, ఇట్టబోయిన రాజు,కాటం అనిల్,తదితరులు ఉన్నారు.

# స్తంభాలకు అనధికారికంగా.. ప్రకటనల బోర్డులు తలిగిస్తే జరిమానా..



**గోదావరిఖని, జనంసాక్షి :** కేంద్రీకృత వీధి దీపాల స్తంభాలకు అనధికారికంగా ప్రకటనల బోర్డులు తగిలించిన అడ్వర్టైజ్ మెంట్ ఏజన్సీ ల నిర్వాహకులకు రూ 50,000/- జరిమానా విధిస్తూ రామగుండం నగర పాలక సంస్థ మంగళ వారం నోటీసులు జారీ చేసింది. కేంద్రీ కృత వీధి దీపాల స్తంభాలకు ఫ్లెక్సీ లు తగిలించడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఏర్పడుతున్నందున గతంలో పలు మార్లు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నోటీసు లు కూడా ఇవ్వడం జరిగిందని అయినా పట్టించుకోక పోవడంతో జరిమానా విధించడం జరిగిందని రామగుండం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు. జరిమానా చెల్లించకపోయినా , స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టడం పునరావృత మైనా సామగ్రి స్వాధీన పర్చుకోవడంతో పాటు చట్ట ప్రకారం అతిక్రమదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ నోటీసులో పేర్కొన్నారు.



# రైతులకు అవగాహన

**చొప్పదండి ,అక్టోబర్ 27 (జనం సాక్షి):** చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్లో నిర్వహించిన ప్రత్యేక రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఖేత్ బచావో అభియాన్?2026 లక్ష్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. చొప్పదండి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ భూసార పరిరక్షణ, భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, పంట అవశేషాల నిర్వహణ, నీటి పొదుపు ఆవశ్యకతను వివరించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త శ్రీనివాస్ ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు, సాగు ఖర్చుల తగ్గింపు పై సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ వంటి ఉద్యాన పంటల సాగు, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు, మల్చింగ్ ద్వారా నీటి సమర్థ వినియోగం గురించి వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ , కేవీకే శాస్త్రవేత్త, ఏఈఓ లు, ఉపసర్పంచ్, ఎఫ్ పి ఓ ప్రతినిధులు, ప్యాక్స్ సభ్యులు, ఎస్ హెచ్ జి సభ్యులు, హెచ్ ఈ ఓ , రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి);** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పెండింగ్ లో ఉన్న రహదారులు మరమ్మతు పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పెండింగ్ పనుల పురోగతిపై చర్చించారు.జిల్లా కేంద్రంలోని రగుడు జంక్షన్, నాంపల్లి జంక్షన్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, చీర్లవంచ?వల్లంపట్ల రహదారి, వేములవాడ రెండవ బైపాస్ రోడ్డు, జిల్లాలోని పలు రహదారులకు అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల సమీపంలో అవసరమైన చోట రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులను తరలించే పాఠశాల ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రవాణా, పోలీసు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పీఎం రహత్ పథకం ద్వారా అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో నగదు రహిత వైద్య చికిత్స అందేలా పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్య సహాయం అందించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పనులకు సంబంధించి మంజూరు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు అదనపు కలెక్టర్కు వివరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఇట్టి సమావేశంలో జాతీయ రహదారుల ఈఈ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఆర్టీసీ డీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం



పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, రైతులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

**అభివృద్ధి పనులకు జిల్లా యంత్రాంగం సహకారం**

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బుర్ర ముత్యాల అరెస్టుపై బీఆర్ఎస్ ఆగ్రహం

**టూ టౌన్ సీఐని సస్పెండ్ చేయాలి**
**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్**



**8 ఇంక్లైన్ కాలనీ(జనంసాక్షి)అక్టోబర్ 27:** బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బుర్ర ముత్యాల అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టూ టౌన్ సీఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని, బుర్ర ముత్యాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి టూ టౌన్ సీఐ కక్షపూరితంగా వ్యవహరిస్తూ బుర్ర ముత్యాలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్‌లా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలా మారిందని విమర్శించారు. అరెస్టు చేసిన ముత్యాలను తమకు చూపించకుండా పోలీస్ స్టేషన్‌లో ఉంచడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు.ఒక మహిళను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడిని మందలించిన విషయంలో బుర్ర ముత్యాలను అరెస్టు చేయడం, ఈ వ్యవహారంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని చందర్ పేర్కొన్నారు. అదే మహిళ తనను ఇబ్బందులకు గురిచేస్తోందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పోలీసులను భారీగా మోహరించి తమపై దాడికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎలాంటి తప్పు చేయకపోయినా కేసులు నమోదు చేసి పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి టూ టౌన్ సీఐని సస్పెండ్ చేయాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.బుర్ర ముత్యాల అరెస్టుకు నిరసనగా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ముత్యాల కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.కాగా, అరెస్టు చేసిన బుర్ర ముత్యాలను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు పోలీసులు వాహనంలో తరలించారు.



# రుద్రంగి బస్టాండ్ లో అభివృద్ధి పనులు ఎక్కడ?

## బీఎస్పీ అధ్యక్షులు ఉదయ్ కుమార్

**రుద్రంగి అక్టోబర్ 27 (జనంసాక్షి)**

రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో బహుజన సమాజ్ పార్టీ రుద్రంగి మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ నాయకులు పర్యటించారు. గత 2024లో సంవత్సరంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెజిటబుల్ మార్కెట్ మరియు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని వారు పరిశీలించారు.అనంతరం బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. శిలాఫలకం ఆవిష్కరించి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా అభివృద్ధి శిలాఫలకం దగ్గరే ఆగిపోయిందని, ఇప్పటి వరకు ఒక్క పని కూడా ప్రారంభించలేదని విమర్శించారు.బస్టాండ్ ఆవరణంలో ప్రతి వారం సంత జరుగుతుందని, ప్రజలు, ప్రయాణికులు అధిక సంఖ్యలో సంచరించే ఈ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.బస్టాండ్ అభివృద్ధి విషయంలో గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని,ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు.ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి పబ్లిక్ టాయిలెట్స్, వెజిటబుల్ మార్కెట్, బస్టాండ్ ఆవరణలో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కేవలం ఎన్నికల ప్రచారంలో మాత్రమే కనిపిస్తారని, రెండు సార్లు ఎంపీగా గెలిచి, మంత్రిగా ఉన్నప్పటికీ రుద్రంగి మండలానికి ఒక్క రూపాయి అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో రుద్రంగి మండల ఇంచార్జ్ ధర్నా ఎల్లన్న యాదవ్, సీనియర్ నాయకుడు కాదాసు మహేందర్,రుద్రంగి మండల ఉపాధ్యక్షుడు ఏనుగుందుల సతీష్,రుద్రంగి గ్రామ అధ్యక్షుడు నల్లా నవదీప్, గ్రామ ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్, గసికంటి అరుణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ అక్కరాజును పరామర్శించిన నాయకులు



**ముస్తాబాద్ అక్టోబర్ 27 (జనం సాక్షి)**

రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంపీపీ మాజీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్‌ను సిరిసిల్ల పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించిన సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ మండల బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు, ముస్తాబాద్ పట్టణ పార్టీ అధ్యక్షులు ఏద్దండి నర్సింహా రెడ్డి, మాజీ సర్పంచ్ దమ్మ రవీందర్ రెడ్డి, జిల్లా బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకట స్వామి, గౌరి సురేష్, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు జిల్లా నాగరాజు, కస్తూరి శ్రీనివాస్ రెడ్డి, మెగాలి పువ్వు సత్యం, నాగరాజు, పార్టీ సోషల్ మీడియా వారియర్స్ పరిదిపేట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు ఆత్మీయ సన్మానం

**మంథని, అక్టోబర్ 27, (జనంసాక్షి):**

పెద్దపల్లి జిల్లా మంథని జనంసాక్షి దినపత్రిక విలేఖరి, సీనియర్ జర్నలిస్ట్ మాటేటి కుమార్ నివాసానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వచ్చిన సందర్భంగా మాటేటి కుమార్ తో పాటు వారి కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబు ను మర్యాద పూర్వకంగా శాలువాతో సన్మానించారు.



# ఎంపీ ధర్మపురి అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నారపాక అశోక్

## జగిత్యాల జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చా బలోపేతంపై చర్చ

**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 27(జనంసాక్షి)**

ఇందూర్ (నిజామాబాద్) పార్లమెంట్ సభ్యులు, బీజేపీ నాయకులు ధర్మపురి అరవింద్ ను బీజేపీ ఎస్సీ మోర్చా మంగళవారంజగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు, దళిత సామాజిక వర్గాన్ని బీజేపీకి మరింత చేరువ చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.ప్రత్యేకంగా బీర్‌పూర్ మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు అంశాలను ఎంపీ ధర్మపురి అరవింద్ దృష్టికి తీసుకెళ్లినట్లు నారపాక అశోక్ తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల మధ్య పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి అవసరమైన మద్దతు, సహకారం అందిస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో జగిత్యాల జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ, దళిత వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతామని నారపాక అశోక్ తెలిపారు.





# ఎంల్వి గనిని సందర్శించిన సీఎంపీడీఐ బృందం

**రామగిరి జనం సాక్షి అక్టోబర్ 27:**

సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గనిని మంగళవారం సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంపీడీఐ) జనరల్ మేనేజర్ శంభుశరణ్ నేతృత్వంలో పమేంద్ర కుమార్ సింగ్, పవన్ కుమార్, రాఘవేంద్ర ప్రతాప్ సింగ్, బృందం సందర్శించింది.ఈ సందర్భంగా అడ్రియాల లాంగ్ వాల్ గని లోని నాలుగో ప్యానెల్ లో ఏర్పాటు చేసిన, ఏర్పాటు చేస్తున్న సపోర్టింగ్ చాక్ లను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది.నాలుగో ప్యానెల్‌కు అనుమతుల మంజూరు ప్రక్రియలో భాగంగా ఈ తనిఖీ బృందం గనిని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించింది.గనిలో భద్రతా ప్రమాణాలు, సాంకేతిక ఏర్పాట్లు, సపోర్టింగ్ వ్యవస్థలను పరిశీలించడం ఈ తనిఖీలో భాగంగా నిర్వహించారు.వారితోపాటు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఎస్ఓటుజిఎం బండి సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ దూప్ సింగ్, ప్రాజెక్టు ఆఫీసర్ కె.జనార్ధన్, ప్రాజెక్టు ఇంజనీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, వి.వో సమద్, జెంకో అధికారులు నరసింహం, బల్ల శ్రీధర్, రంజిత్, ఇతర అధికారులు ఉన్నారు.

# పెంచికల్ పేట్‌లో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

## విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన డీటీఆర్ ఏర్పాటు చేయించిన సర్పంచ్ పల్లె మాధవి నారాయణ

**కమాన్ పూర్, అక్టోబర్ 27, (జనంసాక్షి) :**



పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పెంచి కల్ పేట్ గ్రామంలోని 1వ, 2వ వార్డుల్లో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యను గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడి నూతన డీటీఆర్‌ను ఏర్పాటు చేయించారు. దీంతో ఆయా వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు సభ్యురాలు పిడుగు స్వప్న, 2వ వార్డు సభ్యుడు దొంతుల అఖిల్‌తో పాటు విద్యుత్ శాఖ ఏఈ తూర్పాటి స్వామి, ఎస్ఎల్ఐ కృష్ణ, ఎల్ఐ సత్యనారాయణ రావు, లైన్‌మెన్ నాగరాజు, ఏఎల్ఎం చంద్రమౌళి, అన్‌మన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ ను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**కమాన్ పూర్, అక్టోబర్ 27, (జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య ఇటీవల మరణించగా మంగళవారం రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సాంబయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం సదాశివ ఫౌండేషన్ సంబంధించినటువంటి సభ్యులు సాంబయ్య అవయవ దానం చేసినందుకు గాను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే కమాన్ పూర్ మండల కేంద్రాన్ని చెందిన పెంచాల రాములు అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని, సిద్దిపల్లె గ్రామంలో అనారోగ్యంతో మరణించిన జాబు గట్టయ్య, బూర్ల లింగయ్య కుటుంబాలను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. వారితో పాటు సిద్దిపల్లెలో బైరి మొగిలి, నామిని స్వరూప, మాడిశెట్టి రాజ్ కుమార్ లు అనారోగ్యాలతో బాధపడుతుండగా వారిని మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మంత్రి శ్రీధర్ బాబు పరామర్శలు

**రామగిరి, అక్టోబర్ 27,( జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామంతో పాటు బేగంపేట గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. నాగేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మంథని మండలం సూరయ్యపల్లి గ్రామ కార్యదర్శి శనివారపు జైపాల్, తాటి శ్రీనివాస్ గౌడ్, దూడం వెంకటస్వామి, పొన్నం మధు గౌడ్‌ల చిత్రపటాలకు మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా బేగంపేట గ్రామానికి చెందిన ముత్తే అరవింద్ కళ్యాణ్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు.



# వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం..

## పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గంభీరావుపేట, అక్టోబర్ 27 జనం సాక్షి:
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ హరిహర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రథోత్సవానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఆలయ కమిటీ , వేద పండితులు రాధాకృష్ణ శర్మ, రామాచారి, సప్తగిరి, సుధాకర్ శర్మ తదితరులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జోగు సురేష్, తీర్థప్రసాదాలు అందజేశారు.

**భక్తిశ్రద్ధల నడుమ రథోత్సవం**
శ్రీ వేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై అలంకరించి, మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీలు, భజనల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలో గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, వైస్ చైర్మన్ మేడే భాస్కర్,సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటి, లింగన్నపేట గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఆలయ వైస్ చైర్మన్ జోగు సురేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, గంగి స్వామి తదితరులు పాల్గొన్నారు.



## గంభీరావుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

### చైర్మన్‌గా మహ్మద్ హమీద్.. వైస్ చైర్మన్‌గా మేడ భాస్కర్



గంభీరావుపేట, అక్టోబర్ 27, జనంసాక్షి:
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం సోమవారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహ్మద్ హమీద్, వైస్ చైర్మన్‌గా మేడ భాస్కర్‌ను నియమించింది. పాలకవర్గ డైరెక్టర్లుగా గ్యాద శ్రీజ, బిచ్చాల సతీష్, భూక్య మురళి, ఎర్ర వేణుగోపాల్, పెద్దవేని రాజమల్లయ్య, పుల్లూరి సంతోష్, రఘువీర ప్రసాద్, గాడిచెర్ల శ్రీనివాస్, అల్లెపు రాము, లక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాగపురి రమేష్ గౌడ్‌లను నియమించారు. ఈ నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.



## "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం

**గన్నేరువరం, అక్టోబర్ 27 (జనంసాక్షి):**
ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం అక్టోబర్ 22 నుండి నవంబర్ 30 వరకు అమలు చేయబడుతుంది. ఇందులో భాగంగా మంగళవారం గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట రైతు వేదికలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ మానకొండూర్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి మరియు కేవీకే జమ్మికుంట సైంటిస్ట్ మహేష్ అధ్యక్షత వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి, ఎల్ నినో గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... తక్కువ కాలపరిమితి ఉన్న పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. ఖేత్ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశమైన నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వాడడం, ఆరుతడి పంటలైన నూనె గింజలు, పప్పు ధాన్యాలు ప్రోత్సహించడం గురించి వివరించారు. ఏడీఏ మానకొండూర్ ఎన్. శ్రీధర్ మాట్లాడుతూ... నేల ఆరోగ్యాన్ని సంరక్షించాలంటే రైతులు వరి కొయ్యకాలు, వ్యర్థాలను తగలబెట్టకుండా నేలను కాపాడాలని, సేంద్రీయ ఉత్పత్తుల వాడకంతో నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాసీంపేట, పారువెల్ల, మైలారం, సాంబయ్యపల్లి గ్రామాల రైతులు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వీణవంక ప్రజల రక్షణే డాగ్ స్క్వాడ్ తనిఖీలు

### మాదకద్రవ్యాలపై పోలీసుల ఉక్కుపాదం

### ఎస్ఐ ఆవుల తిరుపతి

**వీణవంక అక్టోబర్ 27(జనం సాక్షి)**
వీణవంక మండల ప్రజల భద్రతే పోలీస్ శాఖ ధ్యేయమని ఎస్ఐ ఆవుల తిరుపతి స్పష్టం చేశారు. మంగళవారం వీణవంక మండల కేంద్రంలో డాగ్ స్క్వాడ్ పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక తనిఖీలు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు కిరణ సముదాయాలు,హోటల్లు,పాన్ షాపులు,బేకరీలు,లాంటి పరిసరాలలో నార్కోటిక్ తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ లేదా నిషేధిత పదార్థాల వాసన లేదా ఉనికి ఉంటే,లియో డాగ్ స్క్వాడ్ ద్వారా వెంటనే గుర్తించగలమని తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగావ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎలాంటి మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ కార్యకలాపాలు జరిగితే, పోలీస్ శాఖ ద్వారా కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ ఆవుల తిరుపతి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజల రక్షణ కోసం గస్తీలు,తనిఖీలు నిర్వహిస్తామనిఅన్నారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ ట్రైనర్ శంకర్,పోలీస్ సిబ్బంది సురేష్,రాజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన

**తక్కువ బరువున్న పిల్లల గుర్తింపు.. తల్లులకు పౌష్టికాహారంపై సూచనలు..**



**గంభీరావుపేట, అక్టోబర్ 27, జనంసాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట సెక్టార్ పరిధిలోని శ్రీగాద అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 'ట్యూస్‌డే 10 ఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి వారి బరువులను పరిశీలించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి అందించాల్సిన పౌష్టికాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఉమారాణి స్పెషల్ ఆఫీసర్, హనుమంతు నాయక్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ వేముల విజయలక్ష్మి మహేందర్, , సూపర్‌వైజర్ స్వరూప, పంచాయతీ కార్యదర్శి దయాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దేవిక, ఉపాధ్యాయుడు సతీష్, ఏఎన్ఎం అనసూయ, అంగన్వాడీ టీచర్లు వనజ, ప్రణీత, ఆశా కార్యకర్త రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు కార్యక్రమానికి హాజరయ్యారు.

## గన్నేరువరం నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

### ఉపాధ్యక్షులుగా సమ్మెట అనిల్



**గన్నేరువరం, అక్టోబర్ 27 (జనంసాక్షి):**
గన్నేరువరం నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అన్ని గ్రామాల నాయి బ్రాహ్మణ సోదరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన సంఘం కమిటీ గురించి మరియు ధరల పట్టిక గురించి చర్చించడం జరిగింది. గన్నేరువరం మండల అధ్యక్షులు ఘర్షకుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన కమిటీ సభ్యులు: ఉపాధ్యక్షులుగా గన్నేరువరం సమ్మెట అనిల్, గడ్డం మల్లేశం నాయి మాదాపూర్, కార్యదర్శిగా ఘర్షకుర్తి రామస్వామి నాయి, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తదుపరి బాడీ యధావిధిగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో నాగవెల్లి లక్ష్మీరాజం, ఘర్షకుర్తి సత్తయ్య, నీలికొండ సంతోష్, మిడిదొడ్డి అనిల్ నాయి, ఘర్షకుర్తి హరీష్, ఘర్షకుర్తి మల్లేశం తదితర అన్ని గ్రామాల నాయి బ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ శిక్షణ కార్యక్రమం..

**జమ్మికుంట, అక్టోబర్ 27 (జనం సాక్షి):**
జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ రైతు వేదికలో మంగళవారం రైతులకు ఖేత్ బచావో అభియాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వేంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ఖేత్ (నేలని) కాపాడాలని కోరారు. భూమి ఆరోగ్యం మనిషి ఆరోగ్యం లాగే చాలా ముఖ్యమైనదని,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు కొరకు రైతులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన భూమి భావితరాలకు సారవంతంగా ఉండి భవిష్యత్తులో మంచి దిగుబడులను ఇవ్వగలదని తెలిపారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితులలో హైడల్ పవర్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో తగ్గినందున రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా వరి పంటను సాధ్యమైనంత తగ్గించాలని కోరారు. నీటి వసతి ఉన్న రైతులు వీలైనంత వరకు ఆరుతడి పంటలైన పెసర,మినుము,కుసుమ, నువ్వులు, పొద్దుతిరుగుడు,మంచి శనగ,బుడ్డ శనగ, మొక్క జొన్న పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని తెలిపారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను రైతులు పాటించాలని కోరారు. మొక్క జొన్న (డి హెచ్ ఎం 206- కరీంనగర్ మక్క 3), మంచి శనగ, కుసుమ విత్తనాలను రైతులకు సబ్సిడీ పై అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతు రిజిస్ట్రీ చేసుకున్న రైతులకు ఇట్టి విత్తనాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు. అనంతరం ఉద్యానవన అధికారి మంజులత మాట్లాడుతూ ఆయిల్పామ్ పంట మంచి లాభదాయకైన పంట అని తెలిపారు. ఒకసారి పంట సాగు చేస్తే 30 సంవత్సరాల వరకు దిగుబడులను పొందవచ్చని తెలిపారు. సబ్సిడీ పై స్ప్రింక్లర్ కొరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి బి. అచ్యుత్, ఆయిల్పామ్ ఎఫ్ ఏ శ్రీదర్,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# భిక్కనూరు గ్రామసభలో గ్రామ సమస్యలపై యువత అగ్రహం

**○గ్రామ సభకు వివిధ శాఖల అధికారులు గైర్హాజరు**

**○ఒక ప్రైవేట్ విద్యాసంస్థకు ఆటస్థలం,పార్కింగ్ కు పన్ను విధింపుపై చర్చ**



**భిక్కనూరు అక్టోబర్ 27 (జనంసాక్షి):** భిక్కనూరు మండల కేంద్రంలో మంగళవారం రోజు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభ గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ జరిగిన అధ్యక్షతన సమావేశంలో పలు అంశాలు చర్చకు రాగా. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకానికి సంబంధించిన లబ్ధిదారులు సభలో వారి అభిప్రాయాలు తెలుపగా గ్రామంలో 14 వార్డులో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి వార్డు సభ్యులు గ్రామ సర్పంచ్ కు షరతులు విధించడంతో ఆ వార్డులో నిర్మాణానికి కావలసినటువంటి భూమి పూజ వాయిదా పడడంతో లబ్ధిదారులు గ్రామసభ దృష్టికి తీసుకురాగా. గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ మాట్లాడుతూ వారి వార్డులో పలు శంకుస్థాపనలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్లాలంటే వారి అనుమతి లేకుండా నావార్డుకు మీరు ఏవిధంగా వస్తారు అని చారవాణి ద్వారా సంభాషించిన విషయాన్ని సర్పంచ్ సభా దృష్టికి తీసుకురాగా ప్రజలు ముక్తకంఠంతో వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ గ్రామస్తుల ఓటుతో సర్పంచ్ గా మేము గ్రామ అభివృద్ధికి ఎన్నుకోవడం జరిగింది. నీపరిపాలనలో ఏదైనా సందేశాలు ఉంటే సవరించుకొని గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారంతో ముందుకు కొనసాగి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అమలు అయ్యే విధంగా కృషి చేయాలని గ్రామ ప్రజలు వారికి సభాముఖంగా మనోధర్యం కల్పించారు.

**ఒక ప్రైవేట్ విద్యాసంస్థకు ఆటస్థలం,పార్కింగ్ కు పన్ను నిర్ణయించిన విధానంలో గ్రామసభలో ప్రజలు,యువకులు తిరుగుబాటు**

గ్రామ పంచాయతీకి ప్రజల నుంచి చెల్లించే పలు రకాల పన్నులు గ్రామ అభివృద్ధికి ఎంతో సహకారం లభిస్తుంది, అయితే గ్రామపంచాయతీకి సంబంధించిన స్థలం డైలీ మార్కెట్, వీక్లీ మార్కెట్ స్థలం నుండి తైబజార్ వేలంలో గ్రామ పంచాయతీకి సంవత్సరానికి సుమారుగా 8 లక్షల నుండి 10 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయం పంచాయతీ చట్ట ప్రకారం నిర్ణయించిన విధానంలో రైతులు,పలు రకాల వ్యాపారుల నుండి నుండి వసూలు చేస్తున్న పన్ను గ్రామ పంచాయతీకి వెన్నుముకగా నిలుస్తుంది. ఈ స్థలంలో ఒక ప్రైవేట్ విద్యాసంస్థకు ఆటస్థలంకు, పార్కింగ్ గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్ణయించిన విధానం రైతులకు ఇటు చిరు వ్యాపారులకు పక్షపాత ధోరణిలో విధించడంతో. ప్రజలు వివరాలతో కూడిన ప్రశ్నలు అడుగుతూ పాఠశాలకు నెలకి 500 రూపాయల చొప్పున సంవత్సరానికి 6000 రూపాయలు చెల్లించటానికి పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసిన విధానంలో గ్రామ ప్రజలు పలకవర్గాన్ని, పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరుతూ నిలదీశారు. గ్రామ ప్రజలు ముక్తకంఠంతో విద్యాసంస్థకు విధించిన పన్నును తక్షణమే రద్దు చేస్తూ గత సుమారుగా 30 సంవత్సరాల నుండి ఆ స్థలాన్ని ఉచితంగా వాడుకుంటూ ప్రభుత్వానికి రావాల్సిన ప్రజాధనాన్ని చెల్లించకుండా ఉండడంతో ప్రజలు యువకులు కలిసి పాఠశాల ఎన్.ఓ.సి తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఈ విద్యా సంవత్సరం పూర్తి కాగానే మార్కెట్ స్థలం నుండి పాఠశాలను వేరే స్థలానికి మార్చుకోవాలని లేని పక్షాన గ్రామ ప్రజలు కోరిక మేరకు రైతులు పండించిన పంటలను డైలీ మార్కెట్ వీక్లీ మార్కెట్ స్థలంలో ఆమ్మకం చేసిన వేల గ్రామపంచాయతీ నుంచి రైతుల నుంచి ఎలాంటి పన్నులు వసూలు చేయరాదని కరకండిగా సూచించారు. ఈసందర్భంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యానికి ప్రజల సూచనలను తెలియజేస్తూ చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

**గ్రామ అభివృద్ధిలో గ్రామ సర్పంచ్ పాత్ర కీలకం**

గ్రామ సభలో పలు అంశాలు చర్చకు రాగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ఎన్నికకు ప్రజలమైన మేము ఓటు వేసి ఎన్నుకున్నాం మీరు స్వయం ప్రతిపత్తితో మీకున్న అధికారాలతో ప్రతి వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్ళుతూ పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు చేయవలసిందిగా ప్రజలు కోరారు. వార్డు పరిధిలో వార్డు సభ్యులు ఎన్నికైన విధానంలో గ్రామ అభివృద్ధిలో ప్రతి వార్డు సభ్యుని పాత్ర కీలకమని ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామసభ వేదికగా పలకవర్గానికి సూచించారు.





## ఆలయ నిర్మాణానికి 20వేల విరాళం సంపత గౌడ్

**లింగంపేట్ అక్టోబర్ 27(జనం సాక్షి)** లింగంపేట మండలం లోని పరమల్ల గ్రామంలో గల వెంకట కాజా ఆలయ నిర్మాణానికి 20 విరాళాన్ని అందజేశారు.టిఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ లింగంపేట్ మండలంలోనీ పర్మల్ల గ్రామం వెంకట ఖాజా ఆలయం నిర్మాణం భక్తులు ఆయన వద్దకు వెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి మంగళవారం తన వంతు సహాయంగా  కోసం 20. ఇరువై వేల రూపాయలు విరాలను అందజేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోకల సాయిరాం.జిల్లా యూత్ అధ్యక్షుడు దేగావత్ జైల్ సింగ్.మండల యూత్ మోహన్ రెడ్డి.మండల మహిళా అధ్యక్షురాలు సావిత్రి.ఎస్ సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరీ సాయిలు.పర్మల్ల గ్రామ అధ్యక్షుడు బద్ద లక్ష్మయ్య. పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ




**గాంధారి జనం సాక్షి అక్టోబర్ 27:** విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించేందుకు యూనిఫామ్‌లు దోహదం అవుతాయని గాంధారి సర్పంచ్ మామ్మాయి రేణుక సంజీవ్ యాదవ్ అన్నారు. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేసింది. విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.విద్యార్థుల్లో సమానత్వ భావనను పెంపొందించడంతో పాటు, క్రమశిక్షణకు యూనిఫామ్‌లు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లాను ఎల్-నినో ప్రభావిత కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**- యుద్ధ ప్రాతిపాదికన, కరువు సహాయక చర్యలు చేపట్టాలి..**

**- అఖిల భారత రైతు-కూలి సంఘం జిల్లా కమిటీ..**




**గోదావరిఖని, జనంసాక్షి :** ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెద్దపెల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు మెమోరాండం ఇచ్చారు.ఈ సందర్భంగా సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి మల్లేశం, ఉపాధ్యక్షులు మేరుగు చంద్రయ్య, కార్యదర్శి కొల్లూరి మల్లేశం లు హాజరై మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితి ఏర్పడి భుగర్భజలాలు అడుగంటి రైతు పండించిన అన్ని రకాల పంటలు కాపు(పొట్ట)దశలో దెబ్బతిని పంట దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టాల్లో ఉన్నారు, రాబోయే రోజుల్లో త్రాగునీరు, సాగునీరు, పశు గ్రాసం విధ్యుత్ కొరతలు ఏర్పడకుండా వెంటనే యుద్ధ ప్రాతిపాదికన క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలని, తక్షణమే పెద్దపల్లి జిల్లాను ఎల్- నినో ప్రభావిత కరువు జిల్లాగా ప్రకటన చేసి సాగు చేయని రైతులకు ఎకరానికి రూ.10,000/-లు, పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ,,25000/-లు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, పంట రుణాలను మాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న నెలకు ?1000 బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని, కోతలను ఎత్తివేసి వ్యవసాయ రంగానికి నిరాటంకంగా ఉచిత కరెంట్ సరఫరా చేయాలి, ఎల్-నినో కారణంగా అనారోగ్య బారిన పడిన వారికి ఉచిత వైద్యం అందించాలని, ట్రూ ఆఫ్ చార్జీల రికవరీ అనుమతిని రద్దు చేయాలని, చార్జీల పెంపు భారాన్ని భేషరతుగాఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కే.ఎం.ఎస్ నాయకులు ఐ రాజేశం, కాదాసీ లింగమూర్తి, టి రాజ కొమురయ్య, ఈ.నరేష్, బి అశోక్ గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, తోకల రమేష్, మల్యాల దుర్గయ్య, మాలెం తిరుపతి, ఏ స్రుజన్ కుమార్, ఆడెపు రాజేశం, ఎండి బాబా, ఈ బాబు, ఎం కొమరయ్య, పోగుల శేఖర్, ఎస్ ప్రసాద్,దూలం సతీష్, బండి సతీష్, తూల్ల సతీష్, కే నారాయణ రెడ్డి, శేకర్, కుమార్, వాసుదేవ రెడ్డి, ప్రేమ్ కుమార్.తదితర రైతు-కూలీలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా.. ట్రాక్టర్ సీజ్, కేసు నమోదు

**ఎస్సై జి. నరేందర్ రెడ్డి**

**గన్నేరువరం, అక్టోబర్ 27 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన బిక్కవాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్ ద్వారా ఇసుకను గన్నేరువరం గ్రామానికి తరలిస్తుండగా, మంగళవారం తెల్లవారుజామున చొక్కారావుపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ ను స్వాధీనపరచుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. కూనవానిపల్లి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కూన సురేష్, గన్నేరువరం కి చెందిన ట్రాక్టర్ యజమాని కవ్వంపల్లి హరీష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని, ఇలాంటి అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.



## పశు వైద్యుల నిర్లక్ష్యానికి ఎద్దు బలి..

**పశు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి: సర్పంచ్**

**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 27 (జనంసాక్షి):** పశు వైద్యుల నిర్లక్ష్యానికి ఎద్దు బలి అయిన ఘటన మంగళవారం పెద్ద కొడప్గల్ మండలంలో చోటు చేసుకుంది. పోచారం గ్రామ సర్పంచ్ బాలాజీ పటేల్ కు చెందిన ఎద్దు (సుమారు రూ.70 వేలు) గత ఐదు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. స్థానికంగా పశు వైద్యాధికారి లేకపోవడం, అంబులెన్స్ కు ఫోన్ చేసిన స్పందన కరువైందని, ఎద్దు చావుకు పశు వైద్యులే కారణమని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక అధికారిపై చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



# విద్యార్థులపై పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## - నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

**ఆర్మూర్,అక్టోబర్ 27(జనంసాక్షి):**
ఆర్మూర్ పట్టణ పరిధిలోని మామిడిపల్లి గ్రామ శివారులో ఉన్న గ్లోరియస్ హై స్కూల్,తపస్వి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానం,విద్యార్థులకు బోధిస్తున్న పద్ధతులు,వారికి అందిస్తున్న భోజన వసతులు,ఇతర మౌలిక సదుపాయాల గురించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి,వారి దైనందిన జీవన పరిస్థితులు,పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి



ఆరోగ్యం,భద్రత,క్రమశిక్షణ,వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత,మంచి నడవడిక,మానవీయ విలువలు,సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని,వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అదనపు కలెక్టర్ తో మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల భేటీ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 జనంసాక్షి:**
నిజామాబాద్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజాగౌడ్ తో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్ లో భేటీ అయ్యారు. జిల్లా డీఎంఏసీ సభ్యులను అదనపు కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీ. ఓకు అనుగుణంగా అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ విషయంలో కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పారదర్శకంగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ ఎన్.పద్మశ్రీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ సమాచార ఇంజనీర్ ఉమేష్ చంద్ర,డీఎంఏసీ సభ్యులు కోయల్ కర్ రామ్ దయానంద్, ఆర్.భూపతి, జి.సాయి ప్రసాద్, ఎంఏ. మాజిద్, ఎల్.బాల్ కుమార్, ఎస్.శ్రీకాంత్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కని కలిసిన సింగిల్ విండో చైర్మన్‌బుర్ర నారా గౌడ్

**లింగంపేట్ అక్టోబర్ 27( జనం సాక్షి)**
ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి సీతక్కను మంగళవారం సాయంత్రం లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ బుర్ర నారా గౌడ్ శాలువా కప్పి పుష్పగుచ్చము అందజేశారు. మంగళవారము నియోజకవర్గంలోని సదాశివ నగర్ గాంధారి రామారెడ్డి మండలాల్లో మంత్రి సీతక్క పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెను మొదటిసారిగా లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు పరిచయం చేయించారు. మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు.రైతులకు సేవలందించాలని విండో అభివృద్ధికి ముందు పని చేయాలన్నారు.పార్టీ కొరకు కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయని పార్టీ కొరకు కష్టపడి పని చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.మంత్రిని కలిసిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు వహాబ్, సింగిల్ విండో డైరెక్టర్ సాయికుమార్, , కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.





# ప్రత్యేక అవసరాల పిల్లల్లోనూ ప్రతిభ దాగి ఉంటుంది

**వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది: ఎంఈఓ వెంకటేశ్వర్లు**

నిజాంసాగర్, **27 అక్టోబర్ (జనం సాక్షి)**
ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, వారిలోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు.
మంగళవారం మహమ్మద్ నగర్ మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తక్కువగా చూడకుండా, వారిలోని ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి తగిన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తూ పిల్లలను ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రాజు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు కే. విజయ, కే. రవిచంద్, సీఆర్‌పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# భారతీయ జనతా పార్టీ బాల్కొండ పట్టణ అధ్యక్షుడిగా కాల రవి నియామకం

**బాల్కొండ న్యూస్ 27 అక్టోబర్ (జనం సాక్షి)**
భారతీయ జనతా పార్టీ బాల్కొండ పట్టణ అధ్యక్షులు గా కాల రవి ని ఎన్నుకున్నారు. కాల రవికి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి బాల్కొండ అసెంబ్లీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి లు నియమక పత్రం అందజేశారు. రవిని బాల్కొండ మండల అధ్యక్షులు అంబటి నవీన్ ఆధ్వర్యంలో మండల నాయకులు ఘనంగా సన్మానించారు. రవి మాట్లాడుతూ నా నియామకానికి కృషి చేసిన బాల్కొండ ఇంచార్జ మల్లికార్జున్ రెడ్డి గారికి, మండల అధ్యక్షులు అంబటి నవీన్ గారికి బాల్కొండ బిజెపి నాయకులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు లింగాగౌడ్, తోట చిన్నయ్య, ఆరెపల్లి నర్సయ్య, సాయికిరణ్, సుంకం శ్రీనివాస్,అశోక్, బోజేందర్, రవీందర్, లింగం, రాంకిషన్, నందిన్, నరేష్, శ్రీకాంత్, నాగేష్, నవీన్, రాము, రాజేశ్వర్ పవన్,, తదితరులు పాల్గొన్నారు.

# "పింఛన్, ఉపాధి హామీ"పై సోషల్ ఆడిట్

**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 27 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం పింఛన్, ఉపాధి హామీ పథకంపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ రాజు మాట్లాడుతూ... పింఛన్ తీసుకుంటున్న వారి వివరాలు, ఉపాధి హామీ పనికి వెళ్తున్న కూలీల వివరాలను నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆడిట్ జరుగుతుందని, నవంబర్ 1వ తేదీన గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు క్రీడా పోటీలు

**పాటలు, ఆటలు, నృత్యాలతో సందడిగా మండల విద్యా వనరుల కేంద్రంలో కార్యక్రమం**

నిజాంసాగర్, **అక్టోబర్ 27 (జనంసాక్షి):**
మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ రకాల ఆటలు, పాటల పోటీలు, నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీయడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాటల పోటీలు, వివిధ ఆటలు, నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేసి అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా విద్యా, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ముందుకు తీసుకెళ్లవచ్చని ఈ కార్యక్రమం తెలియజేసింది. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో సమాన అవకాశాల ప్రాధాన్యతను చాటిచెబుతాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అరుణ్ కుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐఆర్పీలు చిన్న సాయిలు, సునీల్, రాందాస్, కార్యాలయ సిబ్బంది పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మాధవ్‌నగర్ ఆర్ ఓ బి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

## నిరసన దీక్షకు సిరికొండ మండల బీజేపీ నాయకుల సంఘీభావం

**సిరికొండ, అక్టోబర్ 27 జనం సాక్షి:**
మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, నిలిచిపోయిన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఇందూరు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు సిరికొండ మండల బీజేపీ నాయకులు భారీ సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.



**ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు**
మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రయాణ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ సంస్థకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, పనుల్లో జాప్యం లేకుండా ఖీః నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యపై నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్షలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, మండల అధ్యక్షుడు గుర్రం సంజీవ్ రెడ్డి, పోదుగంటి మధు, రంజిత్ రెడ్డి, గోవింద్ నాయక్ తదితర ముఖ్య నాయకులతో పాటు సిరికొండ మండల బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.



# సమయపాలన పాటించండి.. ఖచ్చితంగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్

## బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికతనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యా ఆధికారి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 జనం సాక్షి:**
నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గంధం బుద్ధిరాజ్ అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుడు సమయాపాలన పాటిస్తూ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి క్లాస్ ఇన్చార్జి అధ్యాపకులు విద్యార్థినిల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ను ఉదయం 10:30 గంటలలోగా తీసుకొని ఫార్వర్డ్ చేయాలని ఆదేశించారు. ఇంకా అటెండెన్స్ లో ఫేస్ రికగ్నిషన్ చేయని విద్యార్థుల చేత వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులను ప్రాక్టికల్స్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రాక్టికల్స్ తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. డిసెంబర్ వరకు సిలబస్ మొత్తం పూర్తి చేయడంతో పాటు తరగతుల రివిజన్ ప్రారంభించాలని ఆదేశించారు.

# గ్లోరియస్ హై స్కూల్‌ను సందర్శించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించాలి పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 జనం సాక్షి:**
ఆర్మూర్ పట్టణ పరిధిలోని మామిడిపల్లి గ్రామ శివారులో ఉన్న గ్లోరియస్ హై స్కూల్ (ఉశ్రీనీతీతినీబీబ ఊతిణష్ఠ్ర ూాఇఞ్రనీనీశ్రీ), తపస్వి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌ను మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సందర్శించారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పాఠశాల అవరణను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానం, విద్యార్థులకు బోధిస్తున్న పద్ధతులు, వారికి అందిస్తున్న భోజన వసతులు, ఇతర మౌలిక సదుపాయాల గురించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి దైనందిన జీవన పరిస్థితులు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి ఆరోగ్యం, భద్రత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత, మంచి నడవడిక, మానవీయ విలువలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని, వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ సీఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ యూనివర్సిటీలో రసాయన శాస్త్రవిభాగంలో

## పోతు రాకేష్ కు డాక్టరేట్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 జనం సాక్షి:**
తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి పోతు రాకేష్ రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. "డిజైన్ , సింతేసిస్ అఫ్ నవల తేటరాజోలో ళి1,5–జీరి క్వినోళినే అనలాగ్స్ ఫర్ ఏంటిమైక్రోబియల్ ఆక్టివిటీ " అనే అంశంపై ఆయన డాక్టర్ ఎ. నాగరాజు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనకు బాహ్య పరీక్షకులుగా ఎస్.ఆర్.టి.ఎం. యూనివర్సిటీ, నాందేడ్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్.బి. పట్వారీ వ్యవహరించారు. పరిశోధకుడు తన పరిశోధనను వివరిస్తూ సూక్ష్మజీవుల వల్ల కలిగే ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడానికి నూతన యాంటీమైక్రోబయల్ సమ్మేళనాల అభివృద్ధి ఎంతో అవసరమని, ఈ దిశగా చేపట్టే పరిశోధనలు భవిష్యత్తులో కొత్త ఔషధాల అభివృద్ధికి, ఔషధ రసాయన శాస్త్రంలో మరిన్ని పరిశోధనలకు మార్గదర్శకంగా నిలవగలవని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధనలు సమాజ అవసరాలకు అనుగుణంగా సాగినప్పుడే ప్రజారోగ్యానికి, సమాజ అభివృద్ధికి మరింత ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశోధక విద్యార్థి రాకేష్ ను తెలంగాణ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం. యాదగిరి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి. సాయిలు, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ కె. సంపత్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాంబాబు, ప్రొఫెసర్ విద్యావర్ధిని, డాక్టర్ పున్నయ్య, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ మహేందర్, డాక్టర్ గంగాకిషన్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ డేనియల్, డాక్టర్ నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, డాక్టర్ సురేష్ తదితర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు డిక్షనరీలు

## పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 607 ద్విభాషా డిక్షనరీల పంపిణీ

**సిరికొండ, అక్టోబర్ 27 జనం సాక్షి:**
విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పదజాలాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ద్విభాషా డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కటి సుమారు రూ.270 విలువైన 607 శంకర్ నారాయణ ద్విభాషా డిక్షనరీలను విద్యార్థులకు అందజేశారు.
ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఏపీసీ చైర్మన్ పులి విజయ, వీడీసీ క్యాషియర్ గణేష్ గౌడ్, సలహాదారుడు తాళ్ల శ్రీనివాస్, వీడీసీ సభ్యుడు శోభన్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.




**కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి**
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్య ఎంతో కీలకమని, చిన్నతనం నుంచే పఠన అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. డిక్షనరీలను ఉపయోగించడం ద్వారా ఆంగ్ల పదాల అర్థాలను తెలుసుకోవడంతో పాటు భాషపై పట్టు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని, అందించిన డిక్షనరీలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**ప్రతిరోజూ కొత్త పదాలను నేర్చుకోవాలి**
పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడంలో డిక్షనరీలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొత్త ఆంగ్ల పదాలను నేర్చుకోవడంతో పాటు వాటి అర్థాలను తెలుసుకొని, వాటిని వాక్యాల్లో ఉపయోగించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నిరంతర సాధనతో భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. విద్యార్థులందరికీ ద్విభాషా డిక్షనరీలను అందించడం ద్వారా వారి ఆంగ్ల పదజాలాన్ని అభివృద్ధి చేయడంతో పాటు స్వయంగా నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఏపీసీ చైర్మన్ పులి విజయ, వీడీసీ క్యాషియర్ గణేష్ గౌడ్, సలహాదారుడు తాళ్ల శ్రీనివాస్, వీడీసీ సభ్యుడు శోభన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

## - పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం



**వేములవాడ (జనంసాక్షి):** ఆపదలో ఉన్నవారికి రక్తదానం ప్రాణదానంతో సమానమని,ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున వేములవాడ లోని మహా లింగేశ్వర్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తో కలసి శిబిరాన్ని ప్రారంభించగా, అమరవీరుల స్ఫూర్తితో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు , మీడియా ప్రతినిధులు 400 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈసందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని,పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేసుకోవడమే కాకుండా, సమాజం పట్ల సేవాభావం, బాధ్యతను పెంపొందించుకునేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సెలవులు లేకుండా నిరంతరం విధులు నిర్వహించే శాఖ పోలీస్ శాఖ అన్నారు.ప్రజలను సమన్వయం చేసుకుంటూ, చట్టానికి అనుగుణంగా సేవలందిస్తూ, ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో మీతో మేమున్నాం అనే భరోసాను ప్రజల్లో కల్పిస్తూ పోలీస్ శాఖ ముందుకు సాగుతోందని తెలిపారు.అయితే ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది ప్రజల కోసమేనని, నేరస్తుల పట్ల కాదని స్పష్టం చేశారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని, ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు.'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు, యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పిస్తూ, సమాజాన్ని సురక్షితంగా ఉంచేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.గతంలో పోలీసింగ్ విధానానికి, ప్రస్తుతం అమలవుతున్న పోలీసింగ్ విధానానికి ఎంతో తేడా ఉందన్నారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, సామాజిక సేవలో భాగస్వాములవుతూ పోలీసులు ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ పనితీరును ముఖ్యమంత్రి సైతం అభినందించారని పేర్కొన్నారు.ఇతరులకు సేవ చేసే మనస్తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.జిల్లా అంతర్గత భద్రతలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులు త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.రక్తదానం ఎంతో విలువైన సామాజిక సేవ: జిల్లా ఎస్పీ.జిల్లాలో పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం రోజు వేములవాడలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రక్తదానం అత్యంత విలువైన సామాజిక సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం ప్రమాదంలో పడకుండా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, ఇతరులకు ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ లు శ్రీనివాసులు, నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శేఖర్, సి.ఐ వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు సురేష్, రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గూడూరి రవీందర్, వేణు కుమార్, పాతురి సంజీవ రెడ్డి, శ్రీధర్,డా. సంతోష్,ఎస్.ఐ లు, యువత, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకండి

### ఐకేపి వద్ద కొనుగోలు కేంద్రాలను స్థానిక సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం..

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 27, (జనంసాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభ్వుత కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ మేడిపల్లి దేవానందం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, ఆగ్రహారం గ్రామాలో ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం స్థానిక సర్పంచ్‌లతో కలిసి ఐకేపి వద్ద కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం, స్థానిక సర్పంచ్ ఎనుగందుల నరసింహులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ గౌస్ మాట్లాడుతూ ఎల్‌నివో ప్రభావం వలన మన రాష్ట్రంతో పాటు సుమారు 180 రాష్ట్రాలలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచనలు చేస్తున్నారని దాన్ని రైతులు అర్థం చేసుకొని ఈ కరువును అధిమించడం కోసం ఆలోచించి పంటలు సాగు చేసి నష్టపోకుండా ఉండాలని వారు విజ్ఞాప్తి చేశారు. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి సర్కార్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. రైసు మిల్లర్లు నేరుగా రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని అక్కడ ప్రభుత్వం మద్దతు ధర కంటే లాభం కనిపిస్తే రైతులు విక్రయించుకోవచ్చు అన్నారు. రైతులు 17శాతం మ్యాచరు వచ్చేవిధంగా వరి ధాన్యాన్ని ఆరబెట్టి ప్రభుత్వ మద్దతు ధరను పొంది సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కృష్ణయాదవ్, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్, ఎస్సీ, ఎస్టీ జిల్ల మానిటరింగ్ కమిటి మెంబర్ బిపేట రాజకుమార్, మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, లాలాబాయి, తులసి గ్రామెక్య సంఘం అధ్యక్షురాలు భాగ్య, వినోపి గుండం ముంజుల,సిసి దేవేందర్, సుదర్శన్, ఎరుపుల శ్రీనివాస్, మైనార్టీ నాయకులు రఫీక్, కోనేటి పోచయ్య, రాజేందర్‌రెడ్డి, సర్పంచులు మామిళ్ల కిషన్, ఏఎంసి డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మహిళా సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# రైతులకు సాగునీరు, మద్దతు ధర విషయంలో ఎక్కడ రాజీ పడకుండా పనిచేస్తున్నాము

### - సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లను ఒప్పించి పది రోజులు ఎస్సారెస్పీ నీరు ఇప్పించి పంటలు కాపాడాను

### - దళారుల పట్ల రైతులు జాగ్రత్తవహించాలి - రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

**పెద్దపల్లి,అక్టోబర్ 27(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వర్షాకాలం పంటల విషయంలో వర్షాకాలం పంటల విషయంలో సింగిల్ విండో మరియు ఐకేపీ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వడ్లను దళారులు కొని మళ్లీ అదే దళారులు వడ్ల ధర రేటు తగ్గించే ప్రయత్నం చేసి రైతులను ఇబ్బంది పెడుతున్నారనే విషయంతోనే స్పందించి పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని కొనుగోలు కేంద్రాలను త్వరగా మన నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు ఐకెపి, సింగిల్ విండో సొసైటీల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. రైతుకు బయట అధిక ధర వస్తే అక్కడ కూడా అమ్ముకోవచ్చని అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో కూడా అమ్ముకోవచ్చని ఇది రైతు ఇష్టమని ప్రభుత్వ విజయరమణ రావు అన్నారు. కొనుగోలు కేంద్రాలలో వడ్లు అమ్ముకున్న రైతుకు క్వింటాలకు 2,462 రూపాయల మద్దతు ధరతో వడ్లు అమ్ముకున్న 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తుందని అన్నారు. బోనస్ తో కలుపుకొని రైతుకు క్వింటాలుకు రూ. 2962 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గ రైతుల గుంట కూడా పంట పొలం ఎండ కుండ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో పంటలకు నీరు అందించాను అన్నారు. తూకం విషయంలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ఇన్చార్జులు రైతులను ఇబ్బంది పెడితే తొలగించడం జరుగుతుంది అన్నారు. తుఫాను ప్రభావం ఉందని రైతులు పంటలు కోసిన తర్వాత పంటలు తడవకుండా పాలిథిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు. సూపర్ ఎల్ నీఓ ప్రభావం ఉన్న కారణంగా రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, వ్యవసాయ బావిలో నీరు ఉంటే ఒక ఎకరంకు వరి పారే నీటిని రెండున్నర ఎకరాల మొక్కకు ఉపయోగించుకోవచ్చని, రైతులు ఎలాంటి పంట నష్టపోకుండా వేసవికాలంలో ఆరుతడి పంటలు వేసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్,డిసిఓ శ్రీమాల, మాజీ ఎంపీపీ సునీత -రాజేందర్ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి,దాడి స్వామి యాదవ్,రాఘవపూర్ మాజీ సర్పంచ్ ఆదేపు వెంకటేశం,ఈదునూరి వెంకట్,ఉప సర్పంచ్ ముత్యాల తిరుపతి, వార్డు సభ్యులు కొండ సరిత -రమేష్ యాదవ్,వేల్పుల శ్రీనివాస్,అశోక్,ముజాహిద్, సల్లు ,ఐకెపి సెంటర్ ఇంచార్జ్ దాడి నవీన్ యాదవ్ , చిట్టేటి సంపత్ రెడ్డి, ఈదునూరి రాజ బాబు,దాడి కనకయ్య, బోయిని పోచాలు, రాచకొండ శంకర్,కలవేని రాజేశం,సింగల్ విండో సిఓలు పెద్దపల్లి,మండల పార్టీ అధ్యక్షులు సర్పంచ్లు,ఉపసర్పంచ్లు ,ప్రజాప్రతినిధులు,రైతులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

